సాక్షి నిర్మల్
శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



బసవన్నల పండుగ..
8లో▸

వ్యవసాయ పనులతో అలసిపోయిన బసవన్నలను పూజించే పండుగ పొలాల అమావాస్య. ఈ ఎడ్ల పండుగ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శుక్రవారం జరుపుకోనున్నారు.



మట్టి ప్రతిమలకే జై
9లో▸

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి ప్రతిమలను తయారు చేస్తూ ప్రత్యేకత చాటుతున్నారు కుంటాల మండలం కల్లూరుకు చెందిన ఇద్దరు కళాకారులు.

గరిష్టం/కనిష్టం
30.3 /24.4

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతు పవనాల ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీనియర్ సిటిజన్ల సేవలు భేష్



సిటిజన్లను సన్మానిస్తున్న జడ్జి రాధిక

నిర్మల్‌చైన్‌గేట్: సమాజ శ్రేయస్సు, అభివృద్ధి కోసం పారా లీగల్ వలంటీర్లుగా సేవలందిస్తున్న పెన్షనర్ల సేవలు అభినందనీయమని సీనియర్ సివిల్ జడ్జి, సెక్రెటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ రాధిక అన్నారు. అంతర్జాతీయ సీనియర్ సిటిజన్ డేను పురస్కరించుకుని గురువారం జిల్లాకేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో 90 ఏళ్లు పైబడిన వృద్ధులను సన్మానించారు. జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఎంసీ.లింగన్న మాట్లాడుతూ పట్టణంలోని డే కేర్ సెంటర్, వయోవృద్ధుల సంక్షేమ వసతిగృహం ఏర్పాటు చేసి వాటి నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పాలని కోరారు.

భైంసాలో పీస్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సంకేత్‌కుమార్, పక్కన ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్: పట్టణ ప్రజలు పండుగలు, ఉత్సవాలు శాంతియుతంగా, స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలని సబ్ కలెక్టర్ సంకేత్‌కుమార్, ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో మతపెద్దలు, గణేశ్ మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులతో గురువారం శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. అధ్వాన్న రోడ్లు, విద్యుత్ తీగలు, స్తంభాలతో ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు. సున్నిత ప్రాంతంగా భైంసాకు ఉన్న పేరును తొలగించుకునేలా ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, ఆత్మ చైర్మన్ వివేకానంద, మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్, సీఐ గోపీనాథ్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, మతపెద్దలు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

వైద్యుల మెరిట్ లిస్ట్ విడుదల

నిర్మల్‌చైన్‌గేట్: ఒప్పంద ప్రాతిపదికన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మూడు వైద్యాధికారుల పోస్టులు, బస్తీ దవాఖానాల్లో రెండు వైద్యాధికారుల పోస్టుల భర్తీకి సంబంధించి మెరిట్ లిస్ట్, సెలక్షన్ లిస్ట్ www.nirmal.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఎంహెచ్‌వో రాజేందర్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పీజీహెచ్‌ఎంలకు పోస్టింగ్

నిర్మల్ రూరల్: స్కూల్ అసిస్టెంట్లకు పీజీహెచ్‌ఎంలుగా ప్రమోషన్ ఇస్తూ గురువారం రాత్రి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో మొత్తం 22 పీజీ హెచ్‌ఎం పోస్టులు భర్తీకానున్నాయి. జిల్లాలోని ఆలూరు, చించోలి(బి), బాబాపూర్, సుర్జాపూర్, సత్తెనపల్లి, తాండూర్, కోలూరు, తానూర్ (యు/ఎం), కోతులగాం, ఓలా, మామడ, మచ్కల్, నర్సాపూర్(జి), లోకేశ్వరం, లింబా(కె), బీర్నంది, తిమ్మాపూర్, మాగం, స్వర్ణ, మాటేగాం, మీర్జాపూర్, దేగాం పాఠశాలల్లో వీరికి పోస్టింగ్ ఇచ్చారు. వీరంతా శుక్రవారం జాయిన్ కావాలని ఆర్జేడీ ఆదేశాలు జారీ చేశారు.

కొత్త షెడ్యూల్ విడుదల..

టీచర్ల ప్రమోషన్లకు సంబంధించి ప్రభుత్వం కొత్త షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం ఈనెల 22 నుంచి 24 తేదీ వరకు జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ పోస్టుల వేకెన్సీ జాబితాను ప్రకటిస్తారు. అభ్యంతరాల అనంతరం సీనియార్టీ లిస్టు ప్రకటించి, వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఇస్తారు. ఈనెల 25న వెబ్ ఆప్షన్ నమోదు చేసుకున్న ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తారు. 26న ప్రమోషన్ పొందిన స్కూల్ అసిస్టెంట్లు ఆయా పాఠశాలలో జాయిన్ కావాలి.

ట్రిపుల్ ట్రబుల్స్ తీరేనా?

- తాజాగా మరోమారు సీఎంకు విన్నపం..
- 16 అంశాలతో వినతిపత్రం
- సానుకూల స్పందనతో విద్యార్థుల్లో ఆశలు..



సీఎంను రేవంత్‌రెడ్డిని పదిరోజుల క్రితం కలిసి వినతిపత్రం ఇస్తున్న టీఎస్‌ఏఎస్ అధ్యక్షుడు ఆకాశ్

భైంసా: బాసర ట్రిపుల్ ఐటీ సమస్యలు మరోమారు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లాయి. దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పరిష్కారానికి ఆందోళనలు చేసినా.. అధికారులు, పాలకులు హామీలతోనే సరిపెడుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ (టీఎస్‌ఏఎస్) అధ్యక్షుడు ఆకాశ్ పది రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి బాసర ట్రిపుల్‌ఐటీ సమస్యలపై మరోమారు వినతిపత్రం ఇచ్చారు. 2008లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఈ సంస్థలో 9 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయినప్పటికీ, రెగ్యులర్ అధ్యాపకుల కొరత, నాణ్యత లేని మెస్ ఆహారం, అపరిశుభ్ర సౌకర్యాలు వంటి సమస్యలు ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. తాజాగా సీఎం సానుకూలంగా స్పందించడంతో ఈసారైనా పరిష్కారం అవుతయన్న ఆశలు విద్యార్థుల్లో చిగురించాయి.

అధ్యాపకుల కొరత..

ట్రిపుల్ ఐటీలో కేవలం 15 మంది రెగ్యులర్ అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. 9 వేల మందికి వీరే పాఠాలు బోధిస్తున్నారు. మిగిలిన సిబ్బంది కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నారు. క్రీడా సౌకర్యాలు, శిక్షకులు లేక విద్యార్థులు నిరాశలో ఉన్నారు. ఏడేళ్లుగా ఒకే కాంట్రాక్టర్లు మెస్ నిర్వహిస్తూ నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారు. కాంట్రాక్టు గడువు ముగిసినా వారినే కొనసాగిస్తున్నారు. వాటర్ హీటర్లు, ఆసుపత్రి సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆసుపత్రి, భద్రత సమస్యలు..

క్యాంపస్‌లో గైనకాలజిస్ట్ సేవలు, అత్యవసర వైద్య పరికరాలు అందుబాటులో లేవు. భద్రతా సిబ్బంది విద్యార్థులను అనవసర నిబంధనలతో ఇబ్బంది పెడుతున్నారని, మీడియా, ప్రజా సంఘాలకు అనుమతి నిరాకరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

హామీలకే పరిమితం..

టీఎస్‌ఏఎస్ గతంలోనూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, శ్రీధర్‌బాబును కలిసి సమస్యలు వివరించింది. హామీలు లభించినప్పటికీ శాశ్వత పరిష్కారం లేక విద్యార్థులు నిరాశ చెందుతున్నారు. కొత్త ట్రిపుల్‌ఐటీల స్థాపన ప్రణాళికల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి బాసరపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

సీఎంను కలిశాను

సీఎం రేవంత్‌రెడ్డిని పది రోజుల క్రితం కలిశాను. ఇక్కడి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లాను. సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. మెస్ నిర్వాహణలో లోపాలతోపాటు 16 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ఇచ్చాను. పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారమవుతాయని నమ్ముతున్నాం.

– ఆకాశ్, టీఎస్‌ఏఎస్ అధ్యక్షుడు

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నిర్మల్ పట్టణంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఏఎస్పీ రాజేశ్‌మీనా

నిర్మల్‌చైన్‌గేట్: గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ సూచించారు. ఏఎస్పీ రాజేశ్‌మీనాతో కలిసి పట్టణంలోని బుధవార్‌పేట్ నంబర్ వన్ గణేశ్ మండపం నుంచి ఓల్డ్ బస్టాండ్, బాగులవాడ చౌక్ (ఎంఎల్‌ఏ క్యాంపు ఆఫీస్), గుల్జార్ మార్కెట్, గాంధీచౌక్ మార్గంగా బంగల్‌పేట్ చెరువు నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించారు. పట్టణంలో విగ్రహాల ప్రతిష్ఠాపన, నిమజ్జన ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసు, మున్సిపల్, విద్యుత్, ఆరోగ్య విభాగాలు సమన్వయంతో ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. వారివెంట ఆర్డీవో రత్నకళ్యాణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, తహసీల్దార్ రాజు, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఆది కర్మయోగి అభియాన్ అమలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్రం ప్రభుత్వం చేపట్టిన ఆది కర్మయోగి అభియాన్ కింద అమలుకు చేస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. గిరిజన జనాభాకు విద్య, వైద్యం, మౌలిక ఆర్థిక సదుపాయాలు అందించడంతోపాటు, గ్రామస్థాయిలో పాలనను బలోపేతం చేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. అర్హులందరికీ పథకం ఫలాలు అందించాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లాకు చెందిన ఏడుగురు మాస్టర్ ట్రైనర్లు హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ పొందినట్లు తెలిపారు. సమావేశంలో గిరిజనాభివృద్ధి అధికారి అంబాజీ, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రామారావు, డీపీవో శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ అధికారి రాజనర్సయ్య, డీఏవో అంజిప్రసాద్, ఉద్యానవన అధికారి రమణ, పశుసంవర్ధకశాఖ అధికారి రాజేశ్వర్, గ్రామీణ నీటి సరఫరా అధికారి సందీప్, వైద్యశాఖ అధికారి సౌమ్య, లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్ పాల్గొన్నారు.

మళ్లీ ముందస్తే..!

- నూతన మద్యం పాలసీ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- లిక్కర్ షాపు లైసెన్సు ఫీజు 50% పెంపు
- ఆందోళనలో వైన్స్ యజమానులు
- గత పాలసీతోనే నష్టాలు వచ్చాయని ఆవేదన



నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన నూతన మద్యం పాలసీలో మద్యం దుకాణాల లైసెన్స్ అప్లికేషన్ ఫీజును రూ.3 లక్షలుగా నిర్ణయించింది. గతంలో రూ.2 లక్షలుగా ఉన్న ఫీజుకు 50 శాతం అదనంగా విధించింది. ఈ పెరిగిన ఫీజు, కఠిన నిబంధనలు లిక్కర్ వ్యాపారులను, అలాగే ఈ రంగంలోకి కొత్తగా ప్రవేశించాలనుకునేవారిని నిరుత్సాహపరుస్తున్నాయి. జిల్లాలో 3 మున్సిపాలిటీలు, 18 మండలాల పరిధిలో 47 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల కోసం రిజర్వేషన్ విధానం అమలులో ఉంది. ఇందులో గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం కేటాయించారు. లైసెన్స్ ఫీజు జనాభా ఆధారంగా ఆరు స్లాబ్‌లుగా విభజించింది ఎక్సైజ్ శాఖ. 5 వేల జనాభా వరకు రూ.50 లక్షలు, 5 వేల నుంచి 50 వేల జనాభా ఉంటే రూ.55 లక్షలు, లక్ష జనాభా ఉంటే రూ.60 లక్షలు. లక్ష నుంచి 5 లక్షల జనాభా ఉంటే రూ.65 లక్షలు, 5 లక్షల నుంచి 20 లక్షల జనాభా ఉన్న నగరాల్లో రూ.85 లక్షలుగా పేర్కొంది.

ఆందోళనలో జిల్లా వ్యాపారులు..

2023–25 మద్యం పాలసీ సమయంలో జిల్లాలో 47 దుకాణాల కోసం 1,067కు పైగా టెండర్లు దాఖలయ్యాయి. దరఖాస్తుల ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.21.34 కోట్ల ఆదాయం (నాన్–రిఫండబుల్) సమకూరింది. అయితే, టెండర్ల సమయంలో కనిపించిన పోటీ వ్యాపారం ప్రారంభమైన తర్వాత కనిపించలేదు. చాలా మంది వ్యాపారులు పెట్టుబడికి తగిన ఆదాయం లేక నష్టపోతున్నామని పేర్కొంటున్నారు. కొందరు గుడ్‌విల్ కింద అమ్మేందుకు యత్నించినా కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. జిల్లాలో నెలకు రూ.20 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు రూ.400 కోట్ల వ్యాపారం నమోదైంది. గత పాలసీలోనే వ్యాపారం గిట్టుబాటు కాలేదని, ఇప్పుడు దరఖాస్తు ఫీజు 50 శాతం పెంపుతో వ్యాపారం చేయలేమని చాలా మంది అభిప్రాయపడుతున్నారు.

ముందస్తు ఇలా..

ప్రస్తుత మద్యం పాలసీ నవంబర్ 30తో ముగుస్తుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే టెండరు ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తోంది. సెప్టెంబర్ రెండో వారంలో మద్యం దుకాణాల లైసెన్స్ జారీకి షెడ్యూల్ విడుదల చేయనుంది. అదే నెలలో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి, అక్టోబర్‌లో లాటరీ పద్ధతి ద్వారా దుకాణాలను కేటాయించే అవకాశం ఉంది. ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఆదేశాల ఆధారంగా ఈ ప్రక్రియ ముందుకు సాగనుంది.

వివరాలు

అర్బన్ ఏరియాలో	వైన్సులు	బార్లు
నిర్మల్	11	4
ఖానాపూర్	3	1
భైంసా	5	8

18 మండలాల పరిధిలో 28 షాపులు

గత పాలసీల్లో వచ్చిన దరఖాస్తులు, ఆదాయం..

సంవత్సరం	దరఖాస్తులు	ఆదాయం
2021–23	636	రూ.12.72 కోట్లు
2023– 25	1067	రూ.21.34 కోట్లు

ఎఫ్‌ఆర్‌ఎస్‌తో పెరిగిన హాజరు

- ఉపాధ్యాయుల పారదర్శకతకు బాట
- సత్ఫలితాలిస్తున్న 'ముఖ గుర్తింపు'
- గురువారం 74 మంది గైర్హాజర్



వడ్యాల్ ఉన్నత పాఠశాలలో ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

గురువారం హాజరైన ఉపాధ్యాయులు	గైర్హాజరైన ఉపాధ్యాయులు	లీవ్‌లో ఉన్న ఉపాధ్యాయులు	హాజరు నమోదు శాతం
2,655	74	378	85.78

లక్ష్మణచాంద: పాఠశాల విద్యాశాఖ ఈ నెల 1 నుంచి అమలు చేస్తున్న ముఖ గుర్తింపు హాజరు నమోదు (ఎఫ్‌ఆర్‌ఎస్) విధానం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు పారదర్శకతను మెరుగుపరిచింది. ఈ విధానం ద్వారా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు తమ హాజరును క్రమం తప్పకుండా నమోదు చేసుకుంటున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 19 మండలాల పరిధిలో మొత్తం 711 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 3,110 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, వీరిలో 3,079 మంది ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదు చేసుకున్నారు. గురువారం 2,655మంది ఉపాధ్యాయులు హాజరు కాగా, 74 మంది గైర్హాజరయ్యారు. ఇందులో 378 మంది సెలవులో ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ గణాంకాలు ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదులో పారదర్శకతను సూచిస్తున్నాయి.

గైర్హాజరీకి చెక్

గతంలో కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరు కాకుండా, రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లిపోయేవారు. కొందరు ప్రైవేట్ పాఠశాల నిర్వహణ, రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్ వ్యాపారాలు చేసుకునేవారు. ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం ఈ అనవసర గైర్హాజరీని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ విధానం పాఠశాలకు 100 మీటర్ల పరిధిలోనే పనిచేస్తుంది. దీంతో ఉపాధ్యాయులు తమ హాజరును నమోదు చేయడానికి తప్పనిసరిగా పాఠశాలకు రావాల్సి ఉంటుంది. ఈ విధానం ఉదయం హాజరు నమోదు, సాయంత్రం విధుల ముగింపు సమయంలో రెండుసార్లు అమలవుతుంది, ఇది ఉపాధ్యాయుల బాధ్యతను మరింత పెంచింది.

పర్యవేక్షణ, పారదర్శకత

ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం అమలును పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నుంచి జిల్లా విద్యాశాఖ అధికారులు(డీఈవో), మండల విద్యాశాఖ అధికారులు(ఎంఈవో) పర్యవేక్షిస్తున్నారు. ఈ పర్యవేక్షణతో హాజరు నమోదు ప్రక్రియలో పారదర్శకత గణనీయంగా మెరుగుపడింది. ఈ విధానం ఉపాధ్యాయులు పాఠశాలల్లో క్రమం తప్పకుండా హాజరయ్యేలా చేయడమే కాక, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కూడా దోహదపడుతోంది.

ఉత్తమ ఫలితాలు



పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులకు ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు హాజరు నమోదు జిల్లాలో ఉత్తమ ఫలితాలు ఇస్తుంది. పాధ్యాయులందరూ సకాలంలో పాఠశాలలకు చేరుకుని సాయంత్రం వరకు ఉండి హాజరు నమోదు చేసుకుంటున్నారు. దీంతఅనధికార డుమ్మాలకు చెక్ పడింది.

– రామారావు, డీఈవో

గిరిజన రైతులకు విత్తనాలు పంపిణీ



గిరిజనులకు విత్తన కిట్స్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

కడెం: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో మండలంలోని ఇస్లాంపూర్ కోలాంగూడ వాసులకు కూరగాయల విత్తనాల కిట్స్‌ను గురువారం పంపిణీ చేశారు. 40 మంది గిరిజన రైతులకు విత్తనాల కిట్లు అందించినట్లు ఎన్జీవో ప్రతినిధి రవికుమార్ తెలిపారు. విత్తనాల కిట్లు పంపిన ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రవేశాల గడువు పెంపు

నిర్మల్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025– 26 విద్యా సంవత్సరం డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల గడువు ఈనెల 30 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గంగాధర్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశం కోసం రెగ్యులర్ లేదా ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్ లేదా ఐటీఐ మొదలైన రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. సమత ఫ్రెండ్షిప్ కార్యక్రమం ద్వారా ఆదివాసీలు, ఆదిమ తెగలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత విద్య అందిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7382929703 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి



ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ ఆదేశించారు. నిర్మల్ రూరల్ మండలం చిట్యాలలోని ఎరువుల దుకాణం తనిఖీ చేశారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, యూరియా, డీఏపీసహా అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకే ఎరువులు వాడాలని సూచించారు. ఆయన వెంట డీఏవో అంజిప్రసాద్, సంబంధిత అధికారులు ఉన్నారు.

నానో యూరియా వాడాలి

కుంటాల: పెట్టుబడుల తగ్గింపు, అధిక దిగుబడుల కోసం రైతులు నానో యూరియా వాడాలని డీఏవో అంజిప్రసాద్ సూచించారు. మండలంలోని విఠాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో రైతులకు నానో యూరియాపై గురువారం అవగాహన కల్పించారు. నానో యూరియా ద్రవ రూపంలో ఉండి నేరుగా మొక్కకు అందుతుందని తెలిపారు. డీఏవో వెంట ఏవో విక్రమ్, ఏఈవో గణేశ్, రైతులు ఉన్నారు.

గ్రామాల్లో పనుల జాతర

- వివిధ శాఖల సమన్వయంతో నిర్వహణ
- జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభం
- గ్రామీణ అభివృద్ధికి కొత్త ఊపిరి



లక్ష్మణచాంద: జిల్లా వ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అంకితభావంతో ప్రజలను భాగస్వామ్యం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యం. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేద కూలీ కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరచడం, ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల కూలీ పని దినాలను కల్పించడం ఉపాధి హామీ పథకం ప్రధాన లక్ష్యం.

చేపట్టే పనులు..

కొత్త నిర్మాణాలకు శంకుస్థాపన

2025–26 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా ప్లాస్టిక్ నెస్ట్ యూనిట్, సెగ్రిగేషన్ షెడ్, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణంతోపాటు, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ శాఖల ద్వారా గ్రామీణ రహదారుల నిర్మాణం వంటి కొత్త పనులకు శంకుస్థాపనలు చేస్తారు.

పూర్తయిన పనుల ప్రారంభోత్సవం

ఇప్పటికే పూర్తయిన గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, గ్రామీణ రహదారులు, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం చేస్తారు.

ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా

స్వయం సహాయక సంఘం మహిళలకు పశువుల కొట్టాలు, కోళ్ల షెడ్లు, గొర్రెల షెడ్లు, కొత్త వ్యవసాయ బోరు బావులు, పండ్ల తోటల పెంపకం, వానపాముల ఎరువు తయారీ, అజోలా ఫీడ్ నిర్మాణం వంటి జీవనోపాధి అభివృద్ధి పనులకు మంజూరు ఉత్తర్వులను లబ్ధిదారులకు అందిస్తారు.

వ్యక్తిగత లబ్ధిదారుల పనులు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతీ గ్రామంలో వ్యక్తిగత లబ్ధిదారులకు చెందిన కనీసం ఒక పనికి శంకుస్థాపన చేస్తారు.

కడెంలో ప్రారంభం

'పనుల జాతర–2025' కార్యక్రమం ఖానాపూర్ నియోజకవర్గంలోని కడెం మండలం, ధర్మాజీపేట్ గ్రామంలో ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ పాల్గొననున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొంటారు.

పకడ్బందీగా అమలు..



పనుల జాతర 2025 కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. గ్రామీణ నిరుపేద కుటుంబాలకు మరింత మెరుగైన పనులను కల్పించడం, సంవత్సరం పొడుగునా పని కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడం కార్యక్రమం లక్ష్యం.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

ఫల వనాలు, వన మహోత్సవం...

ఈత మొక్కలు, తాటి చెట్లు, పండ్ల తోటల పెంపకం వంటి పనులకు మంజూరు ఉత్తర్వులను లబ్ధిదారులకు అందిస్తారు.

జల నిధి పథకం..

నీటి సంరక్షణ, భూగర్భ జలాలు పెంచే పనులు చేపట్టిన లబ్ధిదారులను గుర్తించి సన్మానిస్తారు.

దివ్యాంగుల సన్మానం

గత ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ పని రోజులు చేసిన దివ్యాంగుల కుటుంబాలను గుర్తించి ఘనంగా సన్మానిస్తారు.

పచ్చదనం పెంపకం..

గ్రామంలో స్వచ్ఛందంగా చెట్ల పెంపకంలో పాల్గొని, ఇతరుల భాగస్వామ్యంతో పచ్చదనాన్ని పెంచడానికి తోడ్పడిన వ్యక్తులు/కుటుంబాలను సన్మానిస్తారు.

క్లుప్తంగా

అడవిపందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం



ధ్వంసమైన మొక్కజొన్న చేను

ఇంద్రవెల్లి: మండలంలోని అంజీ, హర్కపూర్, వడగామ్ తదితర గ్రామాల్లో అడవిపందుల దాడిలో మొక్కజొన్న చేలు ధ్వంసమయ్యాయి. బుధవారం రాత్రి మండలంలోని అంజీ గ్రామానికి చెందిన దగ్గే సంతోష్ ఎకరం మొక్కజొన్న చేనులో అడవిపందులు దాడి చేయగా పూర్తిగా ధ్వంసమైంది. అటవీశాఖ అధికారులు స్పందించి పంట నష్టపోయిన తమకు పరిహారం మంజూరు చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

గంజాయి సేవించిన యువకుడిపై కేసు

తిర్యాణి: గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని ఉల్లిపిట్ట గ్రామానికి చెందిన నితిన్‌కుమార్ గంజాయి సేవిస్తున్నాడనే సమాచారం అందిందన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో బుధవారం సాయంత్రం నితిన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని డ్రగ్ టెస్టింగ్ కిట్ పరీక్షించగా, పాజిటివ్‌గా తేలిందని పేర్కొన్నారు. అనంతరం యువకుడిని డీ అడిక్షన్ కేంద్రానికి తరలించామని తెలిపారు.

జేసీబీ, ట్రాక్టర్లు పట్టివేత



జేసీబీ, ట్రాక్టర్ పట్టుకున్న రెవెన్యూ అధికారులు

తానూరు: మండలంలోని బోరిగాం గుట్టకు అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్న జేసీబీతోపాటు మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు గురువారం పట్టుకున్నారు. అనుమతి లేకుండా తవ్వకాలు నిర్వహిస్తునట్లు సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని వాహనాలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతిచెందిన ఎద్దు

సిరికొండ: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన రైతు మోరె తానాజీ ఎద్దు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. తానాజీ ఎడ్ల పొలాల పండుగ సందర్భంగా తన ఎద్దులను శుభ్రం చేసేందుకు గ్రామ సమీపంలోని చిక్‌మాన్‌వాగులోకి దించాడు. ఇటీవల కురిసిన వర్షాలకు సమీపంలోని విద్యుత్ స్తంభం నేల కొరిగి తీగలు వాగులో పడ్డాయి. గమనించని అధికారులు విద్యుత్ నిలిపివేయలేదు. దీంతో తానాజీ తన ఎద్దును వాగులోకి దించగా షాక్‌తో మృతి చెందింది. అదృష్టవశాత్తు ఎవరూ అందులోకి దిగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకుని వెంటనే అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

రోడ్ల విస్తరణకు నిధులు కేటాయించండి



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం: ఖానాపూర్ నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ, అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోరారు. గురువారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఖానాపూర్ నుంచి బెల్లాల్, ఖానాపూర్ నుంచి తర్లపాడు, ఉట్నూర్ నుంచి గుడిహత్నూర్, ఉట్నూర్ నుంచి హస్నాపూర్ నార్నూర్ చౌరస్తా, కలమడుగు నుంచి జన్నారం, జన్నారం నుంచి కవ్వాల్ రోడ్లను విస్తరించాలని కోరారు. మంత్రి స్పందించి రోడ్ల విస్తరణకు ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్‌రాజ్‌ను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

బసవన్నల పండుగ.. 'పొలాల'

- నేడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉత్సవాలు
- ఎద్దులతో ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు



ఎడ్లకు పూజలు చేస్తున్న మహిళలు

కెరమెరి(ఆసిఫాబాద్): వ్యవసాయ పనులతో ఆలసిపోయిన బసవన్నలను పూజించే పండుగ పొలాల అమావాస్య. ఎడ్ల పండుగగా ప్రసిద్ధి చెందిన పొలాలను శ్రావణమాసం చివరలో జరుపుకొంటారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయమే రైతులు తమకు సాగులో తోడునీడగా నిలిచే ఎడ్లను శుభ్రంగా కడిగి ముస్తాబు చేస్తారు. కొమ్ములకు రంగులు వేసి వీపుపై బొమ్మలు వేస్తారు. వీపుపై జూలు, మేడలో గంటలు వేసి అలంకరిస్తారు. పండుగ సందర్భంగా సాయంత్రం ఎద్దులతో రైతులు స్థానిక ఆంజనేయస్వామి ఆలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేయనున్నారు. గ్రామాల పటేళ్లు తోరణం తెంపిన తర్వాత ఎడ్ల జతలతో గ్రామాల్లోకి వెళ్తారు.

ప్రత్యేక నైవేద్యం

ఎడ్లతో రైతుల అనుబంధాన్ని పొలాల పండుగ చాటుతుంది. ఇది పురాతన ఆచారంగా పెద్దలు చెబుతుంటారు. ఆలయాల్లో ప్రదక్షిణల అనంతరం ఎడ్లకు ప్రత్యేకంగా చేసిన వంటకాలను నైవేద్యంగా తినిపిస్తారు. ఎద్దు లేని రైతులు కూడా తోటి రైతుల ఇళ్లకు వెళ్లి ఎద్దులకు పూజలు చేస్తారు.

సంబురాల 'బడ్గా'

పొలాల అమావాస్య మరుసటి రోజు బడ్గా పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రావణ మాసంలో నెలరోజులపాటు ప్రజలు మాంసాహారానికి దూరంగా ఉంటారు. పొలాల పండుగ జరుపుకొన్న మరుసటి రోజు బడ్గా సందర్భంగా మాంసాహారం తింటారు. అయితే ఉమ్మడి జిల్లాలో శనివారంతోపాటు ఆదివారం కూడా సంబురంగా బడ్గా జరుపుకోనున్నారు. గ్రామ పులిమేరల్లోని జమ్మి చెట్టు వద్ద పూజలు చేసి నైవేద్యం సమర్పిస్తారు. బడ్గా పండుగ తర్వాత గ్రామాల్లో ఈగలు, దోమల ఉధృతి తగ్గిపోతుందని గ్రామీణులు నమ్ముతారు.

ఎడ్ల పండుగ



ఎడ్లకు చెందిన పండుగగా భావించి రైతులు ఉత్సవాలు జరుపుకొంటారు. శుక్రవారం సాయంత్రం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేందుకు ఏర్పాట్లు చేశాం. గ్రామాల్లో ఉత్సాహంగా వేడుకలు నిర్వహిస్తాం.

– వాడై సోనేరావు, గ్రామ పటేల్, కెరమెరి

ట్రిపుల్‌ఐటీలో ఎంటర్‌ప్రెన్యూర్స్ డే



సదస్సులో మాట్లాడుతున్న మురళీదర్శన్

బాసర: బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో వరల్డ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ డేను గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ హాజరై విద్యార్థులకు సూచనలు చేశారు. పారిశ్రామికవేత్తలు సమాజానికి మార్గదర్శకులని, కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లి వాటిని ఆచరణలో పెట్టే ధైర్యం ప్రతీ విద్యార్థిలో ఉండాలని సూచించారు. విశ్వవిద్యాలయం అందించే ఇన్నోవేషన్ క్లబ్‌లు, ఇంక్యుబేషన్ సెంటర్లు, ప్రాజెక్టు వర్క్‌లతో విద్యార్థులు తమ స్టార్టప్ ఆలోచనలను వాస్తవ రూపంలోకి తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులు తమ స్టార్టప్ ఐడియాలను ప్రదర్శించి, సృజనాత్మక ఆలోచనలు, ప్రాజెక్టు రూపకల్పనలను వివరించారు. వివిధ విభాగాల విద్యార్థులు టీంవర్క్‌తో పనిచేసిన తీరు, భవిష్యత్ ఆలోచనలను ప్రాక్టికల్ మోడల్స్‌గా మార్చే పట్టుదలను ప్రశంసించారు. ఆహార ప్రాసెసింగ్, ప్రపంచ వ్యాపారం, ఎగుమతులు, దిగుమతులు, ఆహార భద్రత వంటి సమకాలీన అంశాలపై విద్యార్థులకు వివరణాత్మకంగా తెలియజేశారు. విజయవంతమైన వ్యాపారులు కావాలంటే ఆవిష్కరణ దృక్పథం, పట్టుదల, క్రమశిక్షణ, సేవాభావం అవసరమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ చంద్రశేఖర్, మహేశ్, జి.నాగరాజు, విఠల్, కోఆర్డినేటర్లు ఆర్.సైదులు, పి.తేజస్విని పాల్గొన్నారు.

చెల్లిని కిడ్నాప్ చేసిన అక్క

- ఆరుగురిపై కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ నాగరాజు

ఆదిలాబాద్‌టౌన్: చెల్లి ప్రేమ వివాహం చేసుకోవడాన్ని ఓర్వలేక ఓ అక్క ఆమెను కిడ్నాప్ చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. చెల్లె భగత్ మనీషా ప్రేమ వివాహం చేసుకోగా, తనకు పెళ్లి కాలేదని తలమడుగుకు చెందిన విజయ ఆమెపై కక్ష పెంచుకుంది. ఆమె భర్త నుంచి విడదీసేందుకు పన్నాగం పన్నింది. ఆమెను మహారాష్ట్రలోని కిన్వట్‌లో బంధించింది. బాధితురాలి భర్త అలుగంటి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కిడ్నాప్‌నకు సహకరించిన తలమడుగుకు చెందిన భగత్ విజయ, భగత్ సునంద, భగత్ ప్రగతి, తాంసికి చెందిన షబ్బీర్, ఓ మైనర్ బాలుడితో పాటు కిన్వట్‌కు చెందిన ప్రతీక్‌పై కేసు నమోదు చేశారు. కిడ్నాప్‌కు గురైన బాధితురాలి ఆచూకీ తెలుసుకుని ఆమెను కిన్వట్ నుంచి తీసుకువచ్చారు. కాగా, మనీషా ఇటీవల భగత్ శ్రీనివాస్‌తో ప్రేమ వివాహం చేసుకుని ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్‌లో నివాసముంటోంది. ఈ పెళ్లి ఇష్టం లేకనే ఆమె అక్క కిడ్నాప్‌నకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. సోషల్ మీడియాలో పోలీసులపై దుష్ప్రచారం చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ వ్యవస్థ మహిళలపై గౌరవంగా వ్యవహరిస్తుందని తెలిపారు. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ ఉన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో గురువారం ఓ వ్యక్తి మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్‌కు చెందిన ముఖేశ్(30) కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబంతో కలిసి పట్టణంలోని ఆర్యవైశ్య కాలనీలో నివసిస్తున్నాడు. రోజు మాదిరిగా బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన అతడిని భార్య సంపత్తి ప్రశ్నించింది. ఇరువురి మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. దీంతో అతడు ఇంట్లోని ఫ్రిజ్, టీవీని పగులగొట్టాడు. అనంతరం భార్యతోపాటు ఇద్దరు పిల్లలను వేరే గదిలోకి నెట్టివేశాడు. వారు పక్కగదిలో నిద్రించగా, ముఖేశ్ మరో గదిలో పడుకున్నాడు. గురువారం ఉదయం బయటికి రాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి తలుపులు తెరవగా.. గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడి భార్య సంపత్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: మంచిర్యాల–పెద్దంపేట రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి(30) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. సంఘటన స్థలం వద్ద మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. ఒంటిపై బ్లూ కలర్ నెక్ టీషర్ట్, టీ షర్ట్‌పై ఆర్ఎస్‌పీ అని, నా బలగం మా గళం అని తెలుగులో రాసి ఉన్నట్లు తెలిపారు. నలుపు రంగు ఫార్మల్ పాయింట్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపర్చామని, వివరాలకు జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

పోస్టర్లు తగులబెట్టిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లిలో శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేసిన పోస్టర్లను తగులబెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన అనుదీప్ బుధవారం రాత్రి 11గంటల ప్రాంతంలో తిర్పెల్లిలో శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేసిన రాముడు, ప్రధాని నరేంద్రమోదీ, యోగి ఆదిత్యనాథ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పోస్టర్లను చించేసి పెట్రోల్ పోసి తగులబెట్టారని పేర్కొన్నారు. తిర్పెల్లికి చెందిన అవారి సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

తాటిచెట్టుపై నుంచి పడి కార్మికుడికి తీవ్ర గాయాలు

తాండూర్: మండలంలోని మాదారం–3 ఇంక్లైన్ గ్రామానికి చెందిన రంగు లక్ష్మీనారాయణ గౌడ్ తాటిచెట్టు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం గ్రామ సమీపంలోని తాటిచెట్టుపైకి ఎక్కి కల్లు తీస్తుండగా అదుపుతప్పి జారి కింద పడ్డాడు. కాలుకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఫుట్‌బాల్ పోటీల్లో సీఓఈ విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బెల్లంపల్లిరూరల్: సుబ్రతో ముఖర్జీ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో బెల్లంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం(సీఓఈ) విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. గురువారం విద్యాలయంలో డీఈవో యాదయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి యాకుబ్ ఆధ్వర్యంలో అండర్–15, 17 విభాగం ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. సీఓఈ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. విజేత జట్టు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ ఆకిడి విజయసాగర్ తెలిపారు. అండర్–15 విభాగం పోటీల్లో మంచిర్యాల ట్రినిటి విద్యార్థులు, అండర్–17 విభాగంలో కోటపల్లి గురుకుల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్లు పీడీలు రవి, చాంద్‌పాషా, నిర్వాహకులు అల్లూరి వామన్, రాజశేఖర్, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఢిల్లీలో తదోరా ఎయిర్‌ఫోర్స్ జవాన్ మృతి



ఈశ్వర ప్రసాద్(ఫైల్)

ముధోల్: ఢిల్లీలో ఎయిర్‌ఫోర్స్ జవాన్‌గా పనిచేస్తున్న ముధోల్ మండలం తరోడా గ్రామానికి చెందిన ఈశ్వరప్రసాద్ (25) బుధవారం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. గ్రామానికి చెందిన శిలారం గంగాధర్ పెద్ద కొడుకు ఈశ్వరప్రసాద్ ఢిల్లీలో జవాన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సహోద్యోగులతో కలిసి ఆగ్రాలోని వాటర్ ఫాల్‌కు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. తోటి ఉద్యోగులు ఆగ్రాలోని వైమానిక కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. వారు స్థానిక పోలీసులతో వాటర్‌ఫాల్ వద్ద గాలించగా, ఈశ్వరప్రసాద్ మృతదేహం లభ్యమైంది. దీంతో అక్కడి అధికారులు కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు ఎమ్మెల్యే రామారావు పటేల్ వద్దకు వెళ్లారు. ఎమ్మెల్యే ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, కేంద్రం హోం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్‌తో ఫోన్‌లో మాట్లాడి మృతదేహాన్ని రప్పించేందుకు ఏర్పాటు చేశారు.

బస్టాండ్‌లో ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్‌లో గురువారం ఒకరు మృతి చెందారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కుప్పకూలాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, మృతుడి వద్ద ఉన్న ఆధార్ కార్డు వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా ఉయ్యూర్‌కు చెందిన క్రిష్టోఫర్ (55)గా గుర్తించినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడు ఆదిలాబాద్ పట్టణంలోని రాజస్తాన్ దాబాలో పనిచేస్తున్నట్లు వివరించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతదేహం రిమ్స్‌లోని మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు.

క్రెడిట్ కార్డుతో రూ.50వేలు మోసం

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి క్రెడిట్ కార్డుతో రూ.50వేలు మోసపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దండేపల్లికి చెందిన వ్యక్తికి తాను లావాదేవీలు నిర్వహించే బ్యాంకు పేరుతో క్రెడిట్ కార్డు అవకాశం కల్పిస్తూ ఫోన్ చేశారు. ఓటీపీలు చెప్పాలని కోరడంతో చెప్పాడు. ఆ తర్వాత రెండ్రోజులకు ఇంటికే క్రెడిట్ కార్డు వచ్చింది. మళ్లీ ఫోన్ చేసి కార్డుపై ఉన్న నంబరు చెబితే ఆక్టివేట్ అవుతుందని చెప్పడంతో అలాగే చేశాడు. ఆదివారం మళ్లీ ఓసారి ఫోన్ చేసి ఓటీపీ నంబర్లు చెప్పాలని కోరడంతో చెప్పాడు. దీంతో రూ.33వేలు ఒకసారి, మరోసారి రూ.16వేలు కట్ అయినట్లు మెస్సేజ్‌లు వచ్చాయి. ఇటీవల కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి వద్ద క్రెడిట్ కార్డు చెక్ చేయగా.. అందులో నుంచి రూ.50వేలు కట్ అయినట్లు తెలిసింది. దీంతో సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎండీ గౌస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న హౌస్ వైరింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, ఫొటోగ్రఫీ, వీడియో గ్రాఫిక్స్, ఏసీ రిపేరింగ్, టూ వీలర్ మెకానిజం, సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, కుట్టు శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం, బస్సు చార్జీలు, ఒక జత యూనిఫాం, టూల్ కిట్స్, శిక్షణ అనంతరం కోర్సు ధ్రువీకరణ పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిలైన 18–45 ఏళ్లవారు అర్హులని పేర్కొన్నారు. ఆధారకార్డు, తెల్లరేషన్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులు, నాలుగు ఫొటోలతో ఈ నెల 27న కేబీలోని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9949412159 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎస్టీపీపీలో ఆధిపత్య పోరు..!

- ఉన్నత అధికారుల మధ్య సమన్వయ లోపం
- అధికారుల బంధువులకు ఉద్యోగాలు

జైపూర్: జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. ప్లాంటు అంతా తన గుప్పిట్లో ఉండాలనే ఉద్దేశంతో ఓ అధికారి ఇతర విషయాల్లో జోక్యం చేసుకోవడం తలనొప్పిగా మారుతోంది. ఇప్పటికే దేశ స్థాయిలో ప్లాంటు విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణలో అనేక అవార్డులు అందుకుంది. అత్యధిక పీఎల్ఎఫ్(ప్లాంటు లోడ్ ఫ్యాక్టరీ)తో అత్యుత్తమ ప్లాంటుగా నిలుస్తూ మంచి కీర్తిని సంపాదిస్తోంది. అనేక విభాగాల్లో 50కి పైగా అవార్డులు అందుకోవడంలో తెరవెనుక అధికారులు, ఉద్యోగుల కృషి ఎంతగానో ఉంది. అందరినీ కలుపుకొని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఈడీ, జీఎం సమన్వయంతో పని చేయాల్సి ఉంటుంది. ఓ వైపు ప్లాంటు నిర్వహణ మరోవైపు ప్రభావిత గ్రామాల ప్రజల సంక్షేమం, కార్మికుల సమస్యలు, ఉద్యోగుల అవసరాలు తీర్చాలి. కానీ.. ఇన్‌చార్జి జీఎంకు జీఎంగా పదోన్నతి కల్పించడం, ఇటీవల ఈడీగా నియామకం అయిన అధికారికి స్థానిక విషయాలపై పెద్దగా పట్టులేకపోవడం వల్ల జీఎం అన్ని విషయాల్లో జోక్యం చేసుకోవడంతో ఇద్దరి మధ్య సఖ్యత కుదరక సమస్యలు తలెత్తుతున్నాయనే చర్చ జరుగుతోంది. జీఎం ఇతర పర్సనల్ డిపార్టుమెంటు అధికారుల పనుల్లో జోక్యం చేసుకుంటున్నారని తెలుస్తోంది. తన అనుమతి లేకుండా ప్లాంటులోకి ఎవరినీ అనుమతించొద్దని, గేట్‌పాస్ రెన్యూవల్ తన ద్వారా జరగాలని, గెస్ట్‌హౌస్‌లోకి అధికారులు, ఉద్యోగులు రావడం, గదుల కేటాయింపునకు తన అనుమతి పొందాలని ఆదేశిస్తున్నట్లు తెసింది. ఇక ఉద్యోగాల కల్పన విషయంలో ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులు తమ తమ బంధువులకు అవకాశాలు కల్పిస్తుండడంతో ఇక్కడి నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. కొందరు నిరుద్యోగులు, గతంలో పని మానేసిన కార్మికులు స్థానిక మంత్రిని కలువగా.. ఆయన వారిని విధుల్లోకి తీసుకోవాలని, నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించాలని లేఖలు ఇచ్చారు. ఆయన పీఏ పదులసార్లు జీఎం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, మంత్రి ఆదేశాలను బేఖాతార్ చేస్తున్నారని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈడీ ఆధీనంలో అన్ని విభాగాల అధిపతులు పని చేయాల్సి ఉంటుంది. ఆయన అధికారాన్ని తగ్గించేలా జీఎం స్థాయి అధికారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తుండడం చర్చనీయాంశంగా మారుతోంది. కాగా, ఈ విషయమై జీఎం కే.శ్రీనివాసులును సంప్రదించగా.. ఇంటర్నల్‌గా చాలా విషయాలు ఉంటాయని, ఈడీకి తనకు రోజువారీగా సమావేశాల్లో ఎన్నో రకాల విషయాలపై చర్చలు వస్తాయని కొన్నింటిలో అభిప్రాయబేధాలు వచ్చినా నిబంధనల ప్రకారం పని చేస్తామని అన్నారు. గేటు పాస్‌లు, గెస్ట్‌హౌస్ విషయంలో తనకు కూడా సమాచారం ఉండాలనే ఉద్దేశంతో ఆదేశించినట్లుగా చెబుతూ చిన్న చిన్న విషయాలు మీరు పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదంటూ దాటవేశారు.

చదువు.. బాధ్యత!



చదువు కోకుంటే గాడిదలు కాస్తావా అంటూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సరిగా చదవని పిల్లలను మందలిస్తుంటారు. కానీ నిర్మల్ జిల్లాలో ఓ విద్యార్థి చదువు కొనసాగిస్తూ గాడిదలు కాస్తున్నాడు. బడికి వెళ్తూనే తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తున్నాడు. జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన కిరణ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఇతని కుటుంబం కూలీ పనులతోపాటు గాడిదల పెంపకం చేపట్టింది. తల్లిదండ్రులు ఉదయమే పనికి వెళ్తారు. దీంతో కిరణ్ ఉదయం స్కూల్‌కు వెళ్లేటప్పుడు గాడిదలను తోలుకెళ్లి శివారులోని మైదానంలో వదిలేస్తాడు. మళ్లీ సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి తోలుకొస్తాడు. అన్ని సౌకర్యాలు ఉన్నా చాలామంది చదువుకోకుండా సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తున్నారు. కానీ పేద కుటుంబంలో పుట్టిన కిరణ్.. చదువుపై మక్కువతో పాఠశాలకు వెళ్తున్నాడు. తల్లిదండ్రులకు తోడుగా గాడిదలనూ చూసుకుంటున్నాడు. గురువారం పాఠశాల అనంతరం గాడిదలను ఇంటికి తీసుకొస్తూ 'సాక్షి' కెమెరాకు చిక్కాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

'కడెం'కు తగ్గిన వరద



నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. ఎగువన వర్షాలు తగ్గడంతో ఇన్‌ఫ్లో కూడా తగ్గినట్లు అధికారులు తెలిపారు. గురువారం ఉదయం ప్రాజెక్టుకు 5,316 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ఒక గేటు ఎత్తి 3,751 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సాయంత్రానికి ఇన్‌ఫ్లో మరింత తగ్గడంతో గేటు మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయినీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 695.825 అడుగులు ఉంది.

– కడెం

పులి దాడిలో మూడు పశువులు మృతి



కళేబరాన్ని పరిశీలిస్తున్న రేంజ్ అధికారి అనిత

కాసిపేట: మండలంలోని దేవాపూర్ అటవీ రేంజ్ పరిధి రొంపెల్లి సెక్షన్‌లో పెద్దపులి దాడిలో మూడు పశువులు మృతిచెందాయి. రేంజ్ అధికారి అనిత తెలిపిన వివరాల ప్రకారం.. తిర్యాణి మండలం ఏదులపాడుకు చెందిన నైతం శేఖర్, తుంరం భీం, తుంరం మాల్కులకు చెందిన ఆవు, ఎద్దు, దూడ మేతకు వెళ్లాయి. బుధవారం సాయంత్రం పెద్దపులి దాడి చేసి హతమార్చింది. గురువారం పశువుల కళేబరాలను, సమీప ప్రాంతంలో పెద్దపులి పాదముద్రలు గుర్తించి నిర్ధారించారు. బాధితులకు త్వరలో పరిహారం అందించనున్నట్లు తెలిపారు. పెద్దపులి సంచరిస్తున్నందున సమీప అటవీవిలోకి వెళ్లవద్దని సూచించారు. పులికి ఎటువంటి ఆటంకం కలిగించవద్దని సూచించారు.

జాతీయస్థాయి పుస్తక రచయిత శిక్షణకు గిరిజన యువతి



పెందూర్ దీపాలక్ష్మి

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రానికి చెందిన ఆదివాసీ గిరిజన యువతి పెందూర్ దీపాలక్ష్మి ఆదివాసీ చరిత్రపై జాతీయస్థాయి పుస్తక రచయిత శిక్షణకు ఎంపికయ్యారు. ఈ నెల 19నుంచి 25వరకు బెంగళూరులో నిర్వహించనున్న శిక్షణలో ఆమె పాల్గొంటున్నారు. గ్రామీణ పేదరిక నిర్మాణ సంఘం, గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డీ దివ్య ఆదేశాల మేరకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్) ఆధ్వర్యంలో ఆదివాసీ చరిత్రపై ఆరు రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గాదిగూడ మండలం నుంచి అర్హత, అనుభవం, నాయకత్వ లక్షణాలు కలిగిన పెందూర్ దీపాలక్ష్మిని డీఆర్డీవో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా దీపాలక్ష్మి 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఒక మెట్టు ఎదగాలంటే డబ్బు ఉంటేనే ఏదైనా చేయగలం.. డబ్బు ఉంటేనే సక్సెస్ అవుతాం.. అనే ఆలోచనను పక్కనపెట్టి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని కష్టపడితే ఏదైనా సాధ్యమవుతుందని చెప్పారు. జాతీయ స్థాయి పుస్తకాల రచయిత శిక్షణకు తాను ఎంపిక కావడానికి పట్టుదల, స్వయం కృషే కారణమని తెలిపారు. ఈ పోటీకి ఎంపికావడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. త్వరలో ఆదివాసీ చరిత్ర, ఆదివాసుల జీవన విధానం పుస్తకాలను ముందుకుతీసుకువస్తానని తెలిపారు. కాగా, జాతీయ పుస్తకాల రచయిత శిక్షణకు ఎంపికైన గిరిజన యువతిని చూసి ఆదివాసీ సమాజం గర్వపడుతోందని రాయిసెంటర్ జిల్లా సార్ మేడి మెస్రం దుర్గు పేర్కొన్నారు.

ఉద్యోగులకు మెరుగైన వసతులు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

నస్పూర్: సింగరేణి ఉద్యోగులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో రూ.1.10లక్షలతో ఆధునీకరించిన ఐటీ విభాగాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులకు మారుతున్న కాలానికి అనుగుణంగా అనుకూల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యాలయంలోని అన్ని విభాగాలను ఆధునీకరించామని, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రెటరీ బాజీసైదా, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం భీభత్స, అధికారులు సాంబశివరావు, రాజన్న, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.